## మిట్టకోడూర్ ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్

పరిగి, సెప్టెంబర్ 19 : పరిగి మండలం, మిట్టకోడూర్ ఉపాధిహామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ కంకంటి మల్లయ్యను సస్పెండ్ చేస్తూ డీఆర్‌డీవో శ్రీనివాస్ ఉత్తర్వులు జారీ చేశారు. ఉపాధిహామీ పనులు చేయకున్నా కొందరికి హాజరు వేసి.. వారికి కూలీ డబ్బులు వచ్చిన తర్వాత.. అందులో సగం వాటా తీసుకున్నారని గ్రామస్తులు డీఆర్‌డీవోకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ జరిపిన అధికారులు ఇటీవల ఫీల్డ్ అసిస్టెంట్ మల్లయ్యను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## 1న వయోవృద్ధులకు పురస్కారాలు



జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి కృష్ణవేణి

వికారాబాద్, సెప్టెంబర్ 19 : వికారాబాద్ జిల్లాలోని విశిష్ట సేవలందిస్తున్న వయో వృద్ధులు, సంస్థలకు అక్టోబర్ ఒకటో తేదీన అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా పురస్కారాలు అందిస్తున్నామని జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల, వయో వృద్ధుల సంక్షేమ శాఖ అధికారి కృష్ణవేణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్హులైనవారు ఈ నెల 25 సాయంత్రం ఐదు గంటల లోపు హైదరాబాద్ మలక్‌పేట్‌లోని నల్గొండ క్రాస్‌రోడ్ బస్టాప్ పక్కనున్న దివ్యాంగుల సంక్షేమ భవనం లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అప్లికేషన్ ఫారం, పురస్కారాల కేటగిరీల కోసం అర్హత , ఇతర వివరాల కోసం www.wdsc.telangana.gov.in డిపార్ట్మెంట్ వెబ్ సైట్ లో చూడాలని తెలిపారు.

# పేరుకే మండల కేంద్రం.. పోస్టులన్నీ ఖాళీ..!

- ఒకే ఒక్కరు విధుల నిర్వహణ
- కుంటుపడుతున్న అభివృద్ధి
- సీఎం సొంత జిల్లా, స్పీకర్ నియోజకవర్గం.. అయినా అధికారులను కేటాయించని వైనం





కోట్‌పల్లి మండల పరిషత్ కార్యాలయం

బంట్వారం(కోట్‌పల్లి), సెప్టెంబర్19 : అది పేరుకే మండల కేంద్రం.. మండల పరిషత్‌లో ఒక్కరే విధులు నిర్వహిస్తున్నారు. పోస్టులన్నీ ఖాళీగా ఉండటంతో ఒక్కరిపైనే పని భారం పెరుగుతున్నది. దీంతో ఎక్కడి పనులు అక్కడే పెండింగ్‌లో పడి ఉంటున్నాయి. ఇంతటి దుర్భర పరిస్థితిని ఎదుర్కొంటున్నది కోట్‌పల్లి మండలం. ఇది సీఎం సొంత జిల్లాలోనే ఉండడం గమనార్హం. ఈ మండలం స్పీకర్ నియోజకవర్గంలోనే ఉన్నది.. అయినా పూర్తిస్థాయి అధికారులను నియమించడంలేదు. గత ప్రభుత్వం 2016లో కొత్తగా ఈ మండలాన్ని ఏర్పాటు చేసింది. మొదట అధికారులు, సిబ్బంది అందరూ ఉన్నారు. అయితే.. గత 2024 పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ప్రభుత్వం అధికారులను స్థానచలనం చేయడంతో ఇక్కడ పనిచేసిన సిబ్బంది ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. దీంతో అప్పటి నుంచి ఎంపీడీవో డేనియల్ ఒక్కరే విధులు నిర్వహిస్తుండగా.. మిగతా పోస్టులన్నీ ఖాళీగానే ఉన్నాయి.

కోట్‌పల్లి మండలంలో సుమారు 23,000 జనాభా ఉండి 18 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. దీనికితోడు జిల్లా హైవే, మార్కెట్ కమిటీ, పోలీస్ స్టేషన్, పలు ప్రభుత్వ కార్యాలయా లు ఉన్నాయి. ఇదేకాక పర్యాటక ప్రదేశం కోట్‌పల్లి ప్రాజెక్ట్ ఉన్నది. కోట్‌పల్లి నుంచి ఇతర జిల్లాలైన సంగారెడ్డి, మెదక్, హైదరాబాద్ ప్రాంతాలకు వెళ్లేలా అనుకూలంగా రవాణా సౌకర్యం ఉంది. అయితే.. ఈ మండలంలో అధికారులు, సిబ్బం ది కొరత అధికంగా ఉంది. దీనిపై సంబంధిత అధికారులుగానీ, ఎమ్మెల్యేగానీ తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

### ఒకే ఒక్కడు..

మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఒక్కరే ప్రస్తుతం కొనసాగుతున్నారు. సూపరింటెండెంట్, ఎంపీవో, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ పోస్టులు 2, అటెండర్ 1 పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. దీంతో మండల పరిషత్ కార్యాలయంలో ఎలాంటి పనులు చేయాలన్నా ఎంపీడీవో ఒక్కరే చేస్తున్నారు.సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ ఉన్నా కొంత పనిభారం తగ్గేది. జూనియర్ అసిస్టెంట్ రెం డు పోస్టులు ఉండగా ఒకరు లాంగ్‌లీవ్‌లో వెళ్ల గా, ఒక పోస్టు ఖాళీగా ఉంది. దీంతో ఉన్న ఒక్కరిపైనే పనిభారం ఎక్కువై పనులు సకాలంలో కావడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

### పోస్టులు భర్తీ చేస్తేనే అభివృద్ధి



మండల పరిషత్ కార్యాలయంలో ఖాళీ పోస్టులను భర్తీ చేస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుంది. గత ఎన్నికల వరకు అన్ని పోస్టులు పూర్తి స్థాయిలో ఉండేవి. పార్లమెంట్ ఎన్నికల నుంచి సిబ్బందిని ట్రాన్స్‌ఫర్ చేసి, ఖాళీ పోస్టులను భర్తీ చేయలేదు. ఎంపీవో లేక గ్రామాల్లో అభివృద్ధి సక్రమంగా జరగడం లేదు. జిల్లా అధికారులు స్పందించి అధికారులను నియమించేలా చర్యలు తీసుకోవాలి.

*–వెంకటేశ్ యాదవ్,సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు, కోట్‌పల్లి మండలం*



షాద్‌నగర్ నేషనల్ హైవేపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసిన ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకుడు ఎమ్మె సత్యనారాయణ

## కాంగ్రెస్ హామీల అమలుపై నిలదీయండి

### బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్

కొత్తూరు, సెప్టెంబర్ 19: ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలుపై వారిని నిలదీయాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచించారు. గురువారం కేటీఆర్ జడ్చర్ల వెళ్తున్న సందర్భంగా షాద్‌నగర్ నేషనల్ హైవేపై ఉన్న దాబా వద్ద ఆగి టీ తాగారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ఎమ్మె సత్యనారాయణ కేటీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్.. ఏం సత్యం ఎలా ఉన్నావంటూ ఆప్యాయం గా పలకరించారు. కాంగ్రెస్ పార్టీ అబద్ధాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అలాగే మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. రాబోయే లోకల్‌బాడీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని దిశానిర్దేశం చేశారని సత్యనారాయణ వివరించారు.

## ఆరోగ్యశ్రీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

### వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌కు వినతి



సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఆరోగ్య శ్రీ ఉద్యోగులు

వికారాబాద్, సెప్టెంబర్ 19 : రాజీవ్ ఆరోగ్యశ్రీ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బాలరాజు కోరారు. గురువారం వికారాబాద్ జిల్లాలోని ఆరోగ్యశ్రీ ఉద్యోగులు.. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ.. ఆరోగ్య మిత్రలకు డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్ క్యాడర్ కల్పించాలన్నారు. జీవో నం.60 ప్రకారం వేతనం రూ.22,750లు తక్షణమే అమలు చేయాలని కోరారు. ఆరోగ్య మిత్రల జీతభత్యాలు ఔట్ సోర్సింగ్ ఏజెన్సీల ద్వారా కాకుండా నేరుగా ట్రస్ట్ ద్వారా చెల్లించాలని తెలిపారు. కాంట్రాక్ట్ విధానంలోకి మార్చాలని, షఫ్లింగ్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. 16 సంవత్సరాల నుం చి పీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తున్న ఆరోగ్య మిత్రలను తిరిగి పీహెచ్‌సీలో నియమించాలని కోరారు. ఆరోగ్య శ్రీలో ఖాళీ పోస్టులను భర్తీ చేసి, సీనియార్టీ ప్రకారం ప్రమోషన్లు ఇవ్వాలని సూచించారు. విధి నిర్వహణలో మరణించిన ఉద్యోగికి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా కల్పించి, ఉద్యోగులందరికీ హెల్త్ కార్డు సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ విషయంపై అదనపు కలెక్టర్ స్పందించి.. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య మిత్రలు నర్సింహులు, ప్రభాకర్, బుచ్చయ్య, శ్రీనివా స్, అరుంధతి, జయశ్రీ, శైలజ, నరసింహు లు, శంకరప్ప, మహేశ్ కుమార్, సీఐటీయూ నాయకులు మైపాల్ పాల్గొన్నారు.

## వారం రోజుల్లో పంట రుణాలు

### బ్యాంక్ మేనేజర్ హామీతో రైతుల దీక్ష విరమణ



బ్యాంక్‌మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న ప్రజాసంఘాల నాయకులు

బొంరాస్‌పేట, సెప్టెంబర్ 19 : సమస్యల పరిష్కారం కోసం బొంరాస్‌పేట ఎస్‌బీఐ ముందు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రైతులు మూడు రోజులుగా చేస్తున్న రిలే నిరాహార దీక్షను గురువారం బ్యాంకు మేనేజర్ హామీతో విరమించారు. రైతులకు వారం రోజుల్లో పంట రుణాలు ఇస్తామని మేనేజర్ వాసూనాయక్ ప్రజా సంఘాలు, రైతులకు హామీ ఇచ్చారు. అదేవిధంగా షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని, బ్యాంకులో సిబ్బందిని పెంచేది తన పరిధిలో లేదని మేనేజర్ రైతులకు వివరించారు. సిబ్బంది కొరత ఉన్నమాట నిజమేనని అన్నారు. అనంతరం ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ ..ప్రభుత్వం స్పందించి ఎలాంటి షరతులు లేకుండా రైతులకు రుణమాఫీ అమలు చేయాలని, ఎస్‌బీఐలో సిబ్బందిని పెంచి వినియోగదారుల ఇబ్బందులు తొలగించాలని కోరారు. ఇదే విషయమై శుక్రవారం కూడా అధికారిని కలిసి వినతిపత్రం అందజేస్తామని ప్రజా సంఘాల నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య, ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు సూర్యా నాయక్, ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు సుభాష్, బాలు, బలరాం, వెంకటయ్య, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## 28న జాతీయ లోక్ అదాలత్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

వికారాబాద్, సెప్టెంబర్ 19 : ఈ నెల 28న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించడం జరుగుతుందని వికారాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి సున్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపా రు. గురువారం వికారాబాద్ జిల్లా కోర్టు ఆవరణలో జిల్లా పోలీసు అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 28న జిల్లా కోర్టులో జరుగు జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిస్కారమయ్యేవిధంగా చూడాలని జిల్లా పోలీసు అధికారులను ఆయన ఆదేశించారు. ఇందులో రాజీ పడదగిన కేసులను రాజీ కుదుర్చుకునేందుకు ఈ లోక్ అదాలత్ చక్కటి అవకాశమన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవ అధికార సంస్థ సెక్రటరీ, న్యాయమూర్తి శీతల్, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ న్యాయమూర్తి శ్రీకాంత్, అదనపు జూనియర్ సివిల్ న్యాయమూర్తి శృతి దూత, వికారాబాద్ జిల్లా అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి , డీఎస్పీలు శ్రీనివాస్ రెడ్డి, కరుణ సాగర్ రెడ్డి, బాలకృష్ణా రెడ్డి, సీఐలు నాగరాజు, భీమ్ కుమార్, అశోక్, శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.

## కేజీబీవీల్లో పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

### వికారాబాద్ జిల్లా విద్యాధికారి రేణుకాదేవి

వికారాబాద్, సెప్టెంబర్ 19 : జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లోని ఖాళీగా ఉన్న పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా విద్యాధికారి రేణుకాదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కేజీబీవీలలో స్పెషల్ ఆఫీసర్, పీజీసీఆర్టీ, సీఆర్టీ, పీఈటీలు, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలోని స్పెషల్ ఆఫీసర్ సీఆర్టీల ఖాళీల్లో తాత్కాలిక కాంట్రాక్టు పద్ధతిలో పనిచేయుటకు గత సంవత్సరం ఆన్‌లైన్ ద్వారా పరీక్ష నిర్వహించి.. మెరిట్ లిస్ట్ ఆధారంగా ఖాళీలు భర్తీ చేశామని తెలిపారు. ప్రస్తుతం 2024 - 25 విద్యా సంవత్సరంలో ఉన్నటువంటి ఖాళీలను గత సంవత్సరం నిర్వహించిన పరీక్ష మెరిట్ లిస్టులో ఉన్న అభ్యర్థులతో ప్రస్తుతం ఉన్న ఖాళీలను భర్తీ చేయమని ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారని ఆమె వివరించారు.

### ఖాళీల వివరాలు..

కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో స్పెషల్ ఆఫీసర్ -3, పీజీ సీఆర్టీ ఇంగ్లీష్- 5, పీజీ సీఆర్టీ ఫిజిక్స్- 1, పీజీ సీఆర్టీ కెమిస్ట్రీ -2, పీజీ సీఆర్టీ బాటనీ -1, పీజీ సీఆర్టీ నర్సింగ్ ,2- 04, పీజీ సీఆర్టీ తెలుగు -3, సీఆర్టీ తెలుగు- 1, సీఆర్టీ హిందీ -3, సీఆర్టీ ఇంగ్లీష్ -2, సీఆర్టీ మాథ్స్ -6 , సీఆర్టీ ఫిజికల్ సైన్స్ -4, సీఆర్టీ బయోలాజికల్ సైన్స్- 4, సీఆర్టీ సోషల్- 1, పీఈటీ -5, అలాగే అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో - స్పెషల్ ఆఫీసర్ 1 , సీఆర్టీ మాథ్స్ 1, తదితర ఖాళీలు ఉన్నాయని తెలిపారు.

## విద్యార్థులు చదువుపై శ్రద్ధ వహించాలి: డీఈవో



మర్పల్లిలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో రేణుకా దేవి

మర్పల్లి, సెప్టెంబర్ 19 : విద్యార్థులు చదువుపై శ్రద్ధ వహించాలని వికారాబాద్ జిల్లా విద్యాధికారి రేణుకాదేవి అన్నారు.. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులకు నిర్వహించిన ఇంగ్లిష్ బోధన శిక్షణ కేంద్రాన్ని ఆమె సందర్శించి పరిశీలించారు.. ఈ సందర్భంగా విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మాట్లాడుతూ ..విద్యార్థులు చదువుపై శ్రద్ధ పెట్టి చదవాలని, ఇంగ్లిష్‌పై విద్యార్థులు ఎవరుకూడా భయపడనవసరం లేదని, నేర్చుకుంటే ఏదైనా సాధ్యమని సూచించారు.. ప్రతి మండలంలో ఉపాధ్యాయులకు ఇంగ్లిష్‌పై శిక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.. ఈ శిక్షణ గురు, శుక్రవారం రెండు రోజులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.. పదో తరగతి విద్యార్థులకు మంచి మార్కులు వచ్చేలా బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు.. ఆమె వెంట మండల నోడల్ ఆఫీసర్ అంజిలయ్య, ఉపాధ్యాయులు ఉన్నారు.

## అన్నదమ్ముల మధ్య గొడవ..

### విడిపించేందుకు వెళ్లిన తల్లి..చిన్న కుమారుడు తోసేయడంతో కిందపడి మృతి

పరిగి, సెప్టెంబర్ 19 : అన్నదమ్ములు గొడవ పడుతుండగా విడిపిం చేందుకు వెళ్లిన తల్లిని చిన్న కుమారు డు తోసేయగా కిందపడి.. మృతి చెందింది. ఈ ఘటన పరిగి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. ఎస్‌ఐ సంతోష్‌కుమార్ కథనం ప్రకా రం.. మండలంలోని సయ్యద్ మల్కాపూర్ గ్రామంలో చెంచు శంకరమ్మ, కుమారుడు శ్రీను నివసిస్తున్నారు. కాగా.. శ్రీనుకు ఫిట్స్ వచ్చినట్లు తెలియగానే అతడి అన్న వెంకటయ్య.. భార్యతో కలిసి బుధవారం సయ్యద్ మల్కాపూర్‌కు వచ్చాడు. కాగా.. అక్క సత్తమ్మ కుమారుడు తిమ్మయ్య కు వెంకటయ్య ఇటీవల రూ.500 సిమ్‌కార్డు కోసం అప్పు ఇప్పించాడు. ఆ డబ్బులు ఎప్పుడు ఇస్తావని అక్క ను అడుగగా నగలు తనఖా పెట్టి చెల్లిస్తానని చెప్పింది. అయితే తనను చూ సేందుకు వచ్చిన అక్కను ఎందుకు డబ్బులు అడుగుతున్నావు.. కావాలంటే తానే ఇస్తానంటూ శ్రీను చెప్పా డు. ఈ విషయంలో బుధవారం రాత్రి అన్నదమ్ములు వెంకటయ్య, శ్రీనుల మధ్య గొడవ జరిగింది. ఇరువురిని విడిపించేందుకు వెళ్లిన తల్లి శంకరమ్మను చిన్న కొడుకు నీవు ఎందుకు వచ్చావంటూ తోయగా ఆమె సీసీ రోడ్డుపై పడి తలకు తీవ్రగాయమైంది. వెంటనే పరిగి దవాఖానకు తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. వెంకటయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# అవినీతికి ప్లాన్

## సీజ్ చేసిన భవనాల్లో స్పీడ్ అందుకున్న పనులు

గ్రేటర్‌లో అడ్డగోలుగా అక్రమ కట్టడాలు

సీజ్ చేస్తున్నా.. కొనసాగుతున్న నిర్మాణాలు

చెయ్యి తడిపితే చాలు.. అక్రమం.. సక్రమమే





### జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్‌లో దందా

అక్రమ నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం..నిబంధనలు అతిక్రమించి నిర్మిస్తే.. నోటీసులు ఇచ్చి నేలమట్టం చేస్తాం..ఇది బల్దియా యంత్రాంగం చెప్పే మాట.. కానీ ఆ మాటలు..చేతల వరకు రావడం లేదు. 'మూటలు' అందితే చాలు.. అక్రమమైనా..సక్రమమైపోతున్నాయి..గ్రేటర్‌లో అడ్డగోలుగా అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి. ఎవరైనా ఫిర్యాదు చేస్తే..నోటీసులు ఇవ్వడం.. సీజ్ చేయడం చేస్తున్నా.. చర్యల విషయాన్ని వచ్చే సరికి టౌన్‌ప్లానింగ్ అధికారులు మిన్నకుండిపోతున్నారు. ఇక్కడ సీన్ కట్ చేస్తే.. సదరు సీజ్ అయిన భవనంలో యజమాని మిగిలిన పనులన్నీ చకచకా కానిచేస్తున్నాడు. ఈ వ్యవహారంలో 'చేతివాటం' గట్టిగా పనిచేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

-సిటీబ్యూరో/కేపీహెచ్‌బీ కాలనీ, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ )

### కండ్లు మూసుకున్న అధికారులు..







#### ఇవిగో ఉదాహరణలు..

కేపీహెచ్‌బీ కాలనీ 5 రోడ్డులో ప్లాట్ నంబర్ 718లో నిబంధనలకు విరుద్ధంగా భవనం నిర్మిస్తున్నారని బల్దియా సీజ్ చేసింది. ఆ నిర్మాణదారుడు ఏమాత్రం భయం లేకుండా...మరునాడే సీజ్‌ను తొలగించి..చకచకా పనులు మొదలుపెట్టి.. పనులన్నీ పూర్తి చేసేశాడు'.





కేపీహెచ్‌బీ కాలనీ 15వ ఫేజ్‌లోని ప్లాట్ నంబర్ 81లో అనుమతులకు విరుద్ధంగా భవనం నిర్మించారని బల్దియా అధికారులు గుర్తించి.. ఆ భవనాన్ని సీజ్ చేశారు. కానీ...సీజ్‌ను అలాగే ఉంచి.. వారం రోజలకే సదరు నిర్మాణదారుడు భవనం లోపల పనులను ప్రారంభించి...పూర్తి సైతం చేశాడు. మరికొద్ది రోజల్లో జీహెచ్‌ఎంసీ సీజ్‌ను తొలగించేందుకు సిద్ధంగా ఉన్నాడు. ఈ వ్యవహారంలో పెద్ద ఎత్తునా.. 'చేతివాటం' పనిచేసినట్లు ప్రచారం సాగుతున్నది.

### ఎన్‌ఫోర్స్ ఎక్కడ?

అనుమతులకు విరుద్ధంగా సెల్లార్లు, అదనపు అంతస్తులు నిర్మిస్తున్నా.. అధికారులు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. ఫిర్యాదు చేసినా..ఒత్తిడి తెచ్చినా.. కేవలం నోటీసులతో సరిపెడుతున్నారు. నోటీసు అందుకునే నిర్మాణదారుడు డబ్బులిస్తే చాలు ..ఆ నిర్మాణం జోలికి వెళ్లడం లేదు. అదేమని అడిగితే సరైన ఎన్‌ఫోర్స్‌మెంట్ లేదని.. స్థానిక టౌన్ ప్లానింగ్ అధికారులు సమాధానమిస్తున్నారు. ఒక నిర్మాణం రాత్రి రాత్రే జరగదు. రోజుల తరబడి ఉంటుంది. ముడుపుల మత్తులో పడి నిబంధనలకు టౌన్ ప్లానింగ్ అధికారులు పాతర వేస్తున్నారు. ఇదిలా ఉంటే నోటీసులు ఇచ్చిన నిర్మాణాల జోలికి వెళ్లకపోవడం మరింత విమర్శలకు తావిస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే టౌన్‌ప్లానింగ్ అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇష్టారాజ్యంగా అనుమతులు ఇస్తున్నారని, అక్రమ నిర్మాణాలను కట్టడి చేయాలని ఆదేశాలు జారీ చేసినా.. ఉన్నతాధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. స్థానిక జీ+4 అంతస్తుల నిర్మాణాలు జరిగే చోట అడ్డగోలుగా అంతస్తుల మీద అంతస్తులు నిర్మిస్తున్నారు. సెట్ బ్యాక్ నిబంధనలు పాటించకుండా ప్రమాదకర స్థాయిలో నిర్మాణాలు జరుగుతున్నాయి. సామాన్యుడు చిన్నగా సెట్ బ్యాక్ ఉల్లంఘన చేస్తే.. చర్యలు తీసుకునే అధికారులు.. బడా నిర్మాణదారుల జోలికి మాత్రం వెళ్లడం లేదు. అక్రమ నిర్మాణాలతో ఇబ్బందులు పడుతున్నామని ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన బాధితులకు భరోసా దక్కడం లేదు.

### ఐఏఎస్ ఆఫీసర్ ఉన్నా.. కనిపించని మార్పు

కూకట్‌పల్లి జోన్ పరిధిలో నిబంధనలను అతిక్రమించి చేపడుతున్న నిర్మాణాలను అడ్డుకోవడంలో అధికారులంతా విఫలమవుతున్నారు. కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌గా ఐఏఎస్ ఆఫీసర్ బాధ్యతలు చేపట్టారు. వెంటనే వివిధ ప్రాంతాల్లో పర్యటించి.. అక్రమ నిర్మాణాలను గుర్తించారు. కొన్నింటిని కూల్చివేయగా, మరికొన్నింటిని సీజ్ చేశారు. వరుసగా రెండు రోజుల్లో ఏడు బిల్డింగ్‌లను సీజ్ చేశారు. ఆగస్టు 13న మూడు బిల్డింగ్‌లను సీజ్ చేయగా, వాటిలో కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని సుభాష్‌నగర్‌లో, గాజుల రామారం సర్కిల్‌లోని కైసర్‌నగర్‌లో, అల్వాల్ సర్కిల్ పరిధిలోని చిన్నరాయుడి చెరువు దగ్గర రామ్‌నగర్‌లో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలున్నాయి. ఆగస్టు 14న నాలుగు బిల్డింగ్‌లను సీజ్ చేశారు. అందులో మూసాపేట సర్కిల్ పరిధిలోని కేపీహెచ్‌బీ కాలనీ 15వ ఫేజ్‌లో, కేపీహెచ్‌బీ కాలనీ 5 రోడ్డులో, కూకట్‌పల్లి సర్కిల్‌లోని వెంకట్‌రావునగర్‌లో, అల్వాల్ సర్కిల్‌లోని రాంనగర్‌లో అక్రమ నిర్మాణాలున్నాయి. జీహెచ్‌ఎంసీ వేసిన సీజ్‌ను తొలగిస్తే.. క్రిమినల్ కేసులు ఉంటాయని హెచ్చరికలు కూడా చేశారు. ఈ చర్యలతో అక్రమ నిర్మాణదారుల్లో వణుకుపుట్టింది. కానీ..వారం రోజులు గడిచేసరికి యజమానులు సీజ్ చేసిన భవనాల్లో పనులు ప్రారంభించారు. కొందరు సీజ్‌ను అలాగే ఉంచి.. ఆ బిల్డింగ్‌లో మిగిలిన నిర్మాణ పనులను పూర్తిచేయగా.. మరికొందరు.. ఏకంగా సీజ్‌ను తొలగించి... నిర్మాణ పనులను కొనసాగిస్తున్నారు. మొత్తానికి జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్‌లో అవినీతి పెచ్చుమీరుతున్న ఆరోపణలు వినిస్తున్నాయి.

### నోటీసులతో సరి..

జీహెచ్‌ఎంసీ సీజ్ చేసిన భవనాల్లో యథేచ్ఛగా నిర్మాణ పనులు సాగుతున్నాయి. ఫిర్యాదు వస్తే అధికారులు రంగంలోకి దిగి.. అలా నోటీసులు ఇచ్చినట్టే ఇచ్చి.. దొడ్డిదారిలో పనులకు అనుమతులు ఇచ్చేస్తుండటం గమనార్హం. స్వయంగా కూకట్‌పల్లి, ఎల్బీనగర్, ఖైరతాబాద్ జోనల్ కమిషనర్లుగా ఐఏఎస్ అధికారులు వచ్చినా.. అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. నివాసయోగ్య పత్రాల మంజూరు, నిర్మాణ అనుమతుల జారీ, అక్రమ నిర్మాణాలు లంచావతారులకు ప్రధాన ఆర్థిక వనరుగా మారుతున్నాయి. అనుమతి కోసం వచ్చే దరఖాస్తులను వేర్వేరు కారణాలతో తొక్కి పెట్టడం, భయాందోళనకు గురయ్యే యజమానుల నుంచి ముడుపులు తీసుకోవడం అధికార యంత్రాంగానికి అలవాటుగా మారింది.

## నేడు సివిల్స్‌పై అవగాహన సదస్సు

సిటీబ్యూరో, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే, రిఫ్లెక్షన్స్ ఐఏఎస్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో సివిల్ సర్వీసెస్‌కు ప్రిపేరయ్యే అభ్యర్థులకు పరీక్ష విధివిధానాలపై అవగాహన కల్పించే దిశగా నేడు ఉచిత అవగాహన సదస్సు నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి మొయినాబాద్‌లోని కేజీరెడ్డి ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో నిర్వహించనున్న ఈ సదస్సుకు యూపీఎస్‌సీ 2014 అచీవర్, మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ డిప్యూటీ డైరెక్టర్ డా.జి.వివేకానంద ముఖ్య అతిథిగా హాజరై అభ్యర్థులకు సివిల్స్ ప్రిపరేషన్‌కు సంబంధించి దిశానిర్దేశం చేస్తా రు. అభ్యర్థులు తమ సందేహాలను నివృత్తి చేసుకోవడానికి సదస్సు సమయంలో తాము అందుబాటులో ఉంటామని రిఫ్లెక్షన్స్ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ రమణ తెలిపారు.